# తెలంగాణ కేసీఆర్ జాగీర్ కాదు

**-కేసీఆర్‌ను వాపస్ పంపాల్సిందే**

**-పేదల భూమి కొని పెద్దలకు పంచుతున్నాడు**

**-ఈటల రాజేందర్‌తోనే కేసీఆర్ అవినీతికి అంతం**

**-ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**



గజ్వేల్, నవంబర్ 28, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ తమ జాగీరుగా భావిస్తున్నారని, కేసీఆర్‌ను, వారి కుటుంబాన్ని వాపస్ పంపాల్సిన సమయం ఆసన్నమైందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్ధతుగా ఏర్పాటు చేసిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ఈటల రాజేందర్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ చేస్తున్న అవినీతి అరాచకాలకు చరమగీతం పాడేందుకే ఈటల రాజేందర్ గజ్వేల్‌కు వచ్చాడని, ప్రజలంతా ఈసారి ఎన్నికల్లో కేసీఆర్‌ను ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానన్న కేసీఆర్ ఆ హామీని ఇవ్వకపోగా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను సైతం లాక్కున్నాడని, భూములకు రూ. 10 లక్షల నుండి రూ.11 లక్షల నష్టపరిహారం ఇచ్చి కోట్ల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. పేదవాళ్లను కొట్టి పెద్ద వాళ్లకు పెడుతున్నాడని, కొండపాక వద్ద కలెక్టర్ కార్యాలయం నిమిత్తం 25 ఎకరాల భూమి అవసరమైతే 350 ఎకరాల భూమిని తీసుకొని మిగతా భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల వరకు మాదిగ వర్గీకరణ చేస్తామని



ప్రధాని మోదీ తెలిపారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధిని కూడా తమ ఖాతాల్లో వేసుకున్న పరిస్థితి కేసీఆర్‌దే అని, బీఆర్ఎస్ పార్టీ కండువా వేసుకోకపోతే వాళ్లకు ఓటు వేయకపోతే తెలంగాణ గడ్డమీద బతకనివ్వమని, కేసులు పెడుతామని బెదిరించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో కేసీఆర్ అహంకారంపై ఈటల గెలిచాడని, నాకు ఏ పదవి కావాలన్నా ఇచ్చే వారున్నారు కానీ మాదిగ ఉద్యమం నీరుగారుతుందని తీసుకోవడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, అందుకే కాంగ్రెస్‌కు నో అన్నాని, ప్రజలంతా బిజేపికి అండగా ఉండి బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, జస్వంత్ రెడ్డి, నందన్ గౌడ్, పేర్ల శ్రీనివాస్, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాస్‌రెడ్డి, మైస రాములు, చల్ల శ్రీనివాస్, ముంద్రాతి కృష్ణ, సురేష్, బండారు మహేష్, మనోహర్ యాదవ్, మరాఠి కృష్ణమూర్తి, పచ్చ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రఘునందన్‌రావుకు మద్ధతుగా నీలకంఠ సంఘం మద్ధతు



దుబ్బాక, నవంబర్ 28, మనం న్యూస్ః దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావుకు మద్ధతుగా దుబ్బాక నీలకంఠ సంఘం ఆధ్వర్యంలో సంపూర్ణ మద్ధతు అందిస్తున్న ట్లు సంఘం అధ్యక్షులు మర్గల సత్యానందం తెలిపారు. మంగళవారం ఆయన సంఘం ప్రముఖులు, మహిళా నాయకురాళ్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావుకు సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కుల సమాజం పెద్దలు, సభ్యులు అంతా రఘునందన్‌రావుకు మద్ధతుగా ఓటింగ్ నిర్వహించడం జరుగుతుం దని, ప్రతి ఒక్కరు తమ విలువైన ఓటును కమలం పువ్వు గుర్తుకు వేసి రఘునందన్‌రావును గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గవ్వల రమేష్, లొంక రాజమౌళి, చింత శేఖరం, వీరబత్తిని రాజమౌళి, అజ్జ రాంచంద్రం, కాల్వ లక్ష్మీనారాయణ, వీరబత్తిని బాలమల్లు, వీరబత్తిని బాల్‌రాజు, చింత శేఖరం, తుమ్మ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# రైతు బాంధవుడు కేసీఆర్



జగదేవ్‌పూర్, నవంబర్ 28, మనం న్యూస్ః రైతుల కష్టం తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి, రైతులకు పంట పెట్టుబడి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని, ఆయన రైతుబాంధవుడని రైతు సమతి మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి లోలాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో రైతుల పొలాల కల్లాల వద్దకు వెళ్లి వడ్లు తూర్పారా పడుతూ సీఎం కేసీఆర్‌కు మద్ధతుగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర రైతాంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు నీరందించడంతో పాటు రైతుబంధు పేరుతో పంట పెట్టుబ డికి డబ్బులు సైతం అందిస్తున్నారన్నారు. అదేవిధంగా పం డించిన పంటను రైతుకు మద్ధతు కల్పిస్తూ స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతుకు మేలు చేకూరుస్తుం దన్నారు. రైతులకు కేసీఆర్ చేస్తున్న మేలును ప్రతిపక్షాలు గుర్తించలేక ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు తెలివిగా ఆలోచించి ఈసారి ముచ్చటగా మూడవసారి కేసీఆర్‌ను గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపించి హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు. ఈ కార్య క్రమంలో తెరాస నాయకులు రవి, శ్రీకాంత్, ప్రశాంత్, భాను, చింటు, భాస్కర్, ప్రశాంత్, బాబు, ఉపేందర్, భా స్కర్, రైతులు కొంతం సత్తయ్య పాల్గొన్నారు.

# దుబ్బాక గడ్డపై కమల వికాసం ఖాయం



### కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మరు

### బీజేపి మండల పార్టీ అధ్యక్షులు పోతరాజు కిషన్

దౌల్తాబాద్, నవంబర్ 28, మనం న్యూస్: దుబ్బాకలో కమలం వికసించడం ఖాయమని దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షులు పోతరాజు కిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపి నాయకులతో కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాకలో మరోసారి కమలం వికసించడం ఖాయమని ఆయన అన్నారు. మూడు



సంవత్సరాలు ఇచ్చిన అవకాశం మరో ఐదు సంవత్సరాలు దుబ్బాక ప్రజలు ఇస్తారని ఆకాంక్షిస్తూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఎమ్మెల్యే రఘునం దన్‌రావు అభివృద్ధి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపి, బిఆర్ఎస్ రెండు ఒకటేనని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎప్పుడో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టామని, కాంగ్రెస్ పార్టీ ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు వారికి అధికారం ఇవ్వరని, కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుమ్ములాట, గుద్దులాటగా ఉంటుందని ఆయన ఎద్దేవా చేశారు. నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించే గొంతుగా వినిపిస్తాడని, అందుకు రేపు జరగబోయే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కమలం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### కవ్వంపల్లి అనురాధ

బెజ్జంకి, నవంబర్ 28, మనం న్యూస్: కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ కవ్వంపల్లి అనురాధ అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కవ్వంపల్లి అనురాధ ప్రజలను కోరారు. లక్ష్మీపూర్ గ్రామ ప్రజలకు తమకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ జనరల్ సెక్రటరీ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, బెజ్జంకి మండలం మహిళా అధ్యక్షురాలు కనగండ్ల జ్యోతి గ్రామశాఖ అధ్యక్షులు రెడ్డి రామకృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షులు గంగాధర హరీష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోనగిరి శంకర్, ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు భువనగిరి రాజయ్య, గౌరెల్లి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.







## చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

### మున్సిపల్‌లో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

దుబ్బాక టౌన్, నవంబర్ 28, మనం న్యూస్: ఈసారి ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ యూత్ అధ్యక్షులు బురాని శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 6, 7, 8, 9 వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల అమలు తప్పకుండా చేస్తామన్నారు. కావున ప్రజలంతా తమ విలువైన ఓటును హస్తం గుర్తుకు వేసి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు.



